క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తికి గాయాలు

మానవపాడు: ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన మండలంలోని మద్దూరు శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మద్దూరు గ్రామానికి చెందిన మద్దిలేటి ట్రాక్టర్‌పై గ్రామ శివారులోని పంట పొలంలో దిమ్మెకు బెడ్ వేయడానికి వెళ్తుండగా మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు బోల్తా పడింది. ప్రమాదంలో మద్దిలేటికి స్వల్ప గాయాలవగా కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

కోల్డ్‌స్టోరేజీలో తప్పిన ప్రమాదం

మానవపాడు: కోల్డ్‌స్టోరేజీలో పనులు చేస్తుండగా 4వ ఫ్లోర్ నుంచి కిందపడి యువకుడు గాయాలపాలైన ఘటన మండలంలోని నారాయణపురం శివారు ప్రాంతంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఇటిక్యాల మండలం సతర్ల గ్రామానికి చెందిన ముులేంద్రరెడ్డి మండలంలోని నారాయణపురం కోల్డ్‌స్టోరేజీలో కూలి పనుల కోసం వెళ్తుంటాడు. ఆదివారం ఉదయం 11.30 గంటల సమయంలో కోల్డ్‌స్టోరేజీలోని 4వ ఫ్లోర్‌లో పనులు చేస్తుండగా కరెంట్ పోవడంతో ప్రమాదవశాత్తు 4వ ఫ్లోర్ నుంచి జారి కిందపడ్డాడు. కాలు, వీపు భాగంలో గాయాలవడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉండవెల్లి: మండల కేంద్రానికి చెందిన యువకులు నరహరి(27), శివాచారి బైక్‌పై ఆత్మకూరు నుంచి కర్నూల్‌కు బంగారు ఆభరణాల పనులకు వెళ్తూ గతనెల 29న ఉండవెల్లి శివారులోని జాతీయ రహదారిపై డివైడర్‌కు ఢీకొట్టారు. ప్రమాదంలో నరహరి తీవ్రంగా గాయపడగా కర్నూల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నరహరి చికిత్స పొందుతూ ఈనెల 3న అర్ధరాత్రి మృతి చెందాడు. ఆదివారం మృతుడి చిన్నాన్న కమ్మరి కాలప్ప ఫిర్యాదు మేరకు శివాచారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

సైకిల్‌ను ఢీకొట్టిన బైక్.. వ్యక్తికి గాయాలు

ధరూరు: సైకిల్‌ను బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలోని దోర్నాల గ్రామం వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన మొద్దన్నగారి పెద్ద వెంకటన్న సైకిల్‌పై దోర్నాలకు వెళ్తుండగా బైక్‌పై ఎదురుగా వస్తున్న పాతపాలెం గ్రామానికి చెందిన యువకుడు ఢీకొట్టాడు. దీంతో తీవ్ర రక్త గాయాలైన వెంకటన్నను 108 అంబులెన్స్‌లో గద్వాల ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

హార్మోనియం అందజేత



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన పాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం గద్వాల మండలం పుటాన్‌పల్లికి చెందిన భక్తుడు రాంరెడ్డి రూ.25 వేల విలువైన హార్మోనియం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



ధరూరు: యువత సన్మార్గంలో నడవాలని పాస్టర్ రవికుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చి, కల్వరి చర్చి, హోసన్నా మందిరం, మరనాథ విశ్వాస సమాజ మందిరాల్లో మొదటి ఆదివార ప్రత్యేక బల్లారాధన ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైబిల్ ప్రవచనాలు బోధించారు. యువత మానసిక రుగ్మతలకు లోనవుకావొద్దన్నారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు.

నిషేధిత కల్లు విక్రేతల అరెస్టు

గద్వాల క్రైం: నిషేధిత కల్లు విక్రయించిన వారిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గణపతి రెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారి విజయ భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం అర్ధరాత్రి మండలంలోని మదనపల్లిలో ఈడిగ పద్మ, చేనుగోనిపల్లిలో తెలుగు వెంకటేష్, తెలుగు నాగన్నలు కల్లు విక్రయిస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్సు సిబ్బంది దాడి చేసి 210 లీటర్ల నిషేధిత కల్లు ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. నిషేధిత కల్లు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గ్రామాల్లో తాగునీటి కష్టాలు

- భగీరథ కుళాయిల్లో రాని నీళ్లు
- చోద్యం చూస్తున్న అధికారులు
- బోరు నీరే దిక్కంటున్న ప్రజలు



ఉండవెల్లిలో బోరు వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

ఉండవెల్లి: గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో మోటార్ల వెంట నీరు రాక అల్లాడుతున్నారు. కనీసం నల్లాల వెంట కూడా చుక్క నీరు రావడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. భగీరథ అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

16 గ్రామ పంచాయతీల్లోనూ

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో వేసవి మొదలైనప్పటి నుంచి నీటి సమస్య తలెత్తిందని ప్రజలు పేర్కొన్నారు. ముఖ్యంగా మారుమునగాల-2లో అసలు భగీరథ నీరు రావడం లేదంటున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 15 వేల కుళాయి కనెక్షన్లలో కనీసం సగం కనెక్షన్ల వెంట కూడా నీరు రావడం లేదంటున్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ప్రతి పది కనెక్షన్లలో ఒక కుళాయికి కూడా నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంట్లో కుళాయి కనెక్షన్లు ఉన్నా బోరు బావుల వెంట పరుగెత్తాల్సి వస్తుందని, డబ్బులు చెల్లించి నీటిని పట్టుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

తొలగిస్తున్న పైపులైన్ బాల్స్

మేజర్ పంచాయతీల్లో కుళాయి వద్ద ఏర్పాటు చేసిన బాల్స్‌ను తొలగించి కొందరు అక్రమార్కులు నీటిని అక్రమంగా తరలిస్తున్నారు. సాధారణంగా ప్రతి కనెక్షన్‌కు బాల్స్ ఉండాలన్న నిబంధనలు పట్టించుకోకుండా నీటిని నిబంధనకు మించి వినియోగిస్తున్నారు. కుళాయి కనెక్షన్ వద్ద బాల్స్ తొలగించేందుకు ప్రైవేటు కార్మికులు రూ.2500 వరకు డబ్బులు వసూలు చేస్తున్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందుల పడుతుంటే మరికొందరు అక్రమంగా నీటిని తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా భగీరథ అధికారుల పర్యవేక్షణ కరువైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కంచుపాడులో మసీదు వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

కనెక్షన్ల తొలగింపు

వేసవిలో భగీరథ నీరు ప్రజలు అల్లాడుతుంటే మరోవైపు అధికారులు నీరు రావడం లేదంటూ కనెక్షన్లు తొలగిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా రెండు మూడు రోజుల కొకసారి వచ్చే నీటిలోనూ మురుగు కలుస్తుందంటున్నారు. భగీరథ ట్యాంకులను బయట నుంచి మాత్రమే పరిశీలిస్తున్న అధికారులు, ట్యాంకులు ఎక్కి పరిశీలించడం లేదని ప్రజలు పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో నీరు రావడం లేదని అధికారులకు విన్నవించుకుంటున్నా పైసల్ లేవంటే.. పైపులో నీరు రావంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి వేసవిలో తాగునీటి కష్టాలు తొలగించి, నల్లాల వెంట నీరు విడుదల చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మండల కేంద్రంలో షాపుల వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

వాల్వ్ మార్చడం లేదు..

భగీరథ కుళాయి వెంట నీరు రాక పక్క వీధుల వెంట లేదా బోరు బావుల వద్దకు నీటి కోసం వెళ్లాల్సి వస్తోంది. నీటి సమస్యపై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. వాల్వ్‌ను మార్చాలని అడుగుతున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

– ఈశ్వర్, ఉండవెల్లి

బోరు నీరే దిక్కు..

గ్రామంలో ఏర్పాటు చేసిన భగీరథ కుళాయిల వెంట నీరు రావడం లేదు. నాయకులు, అధికారుల ఇళ్లకు మాత్రమే నీటిని తరలిస్తున్నారు. ఆలయాలు, బోర్ల వద్ద నీటిని తెచ్చుకుంటున్నాం. అమ్మవారికి మొక్కులు చెల్లించడానికి వచ్చిన వ్యక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

– నర్సింహనాయుడు, కంచుపాడు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మల్దకల్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 2004–05 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మల్దకల్ ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటేశ్వరావు, సరోజమ్మ, మేరమ్మ, కోదండ రామిరెడ్డి, భాస్కర్ పాపన్న, వనజ, రాజేశ్వరితో పాటు పలువురు ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



తొత్తినోనిదొడ్డిలో పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సంపత్‌కుమార్

అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డి గ్రామంలో ఆదివారం దేవమ్మ, గంగమ్మ గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా నౌరోజీ క్యాంపులో తాయమ్మ గ్రామదేవత విగ్రహాన్ని వేద పండితులు ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



నౌరోజీ క్యాంపులో విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న వేదపండితులు

మానవపాడు: మండలంలోని ఏ. బుర్దిపాడు గ్రామంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రే స్వామి తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 7న గణపతి కలశపూజ, అభిషేకం, కల్యాణం, అన్నదానం, ప్రభ ఊరేగింపు, నందికోళ్ల సేవ, 8న రథోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

భక్తుల ఇలవేల్పు లోకిరేవు వీరభద్రుడు

- రేపటి నుంచి వీరభద్రస్వామి ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

నవాబుపేట: మండలంలోని లేకిరేవులో ఏకశిలతో స్వయంభూగా వెలసి.. ఇక్కడి ప్రజల ఇంటి దేవుడిగా వెలుగొందుతున్న భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏకశిలతో నిలువెత్తు రూపం లోకిరేవు వీరభద్రుడి ప్రత్యేకత. ఎక్కడ అయినా వీరభద్రుడి విగ్రహం చిన్నగా ఉంటుంది. కానీ లోకిరేవులోని పురాతన దేవాలయంలో మాత్రం ఐదున్నర అడుగుల నిలువెత్తు విగ్రహం ఏకశిలతో ఉండటం.. వీరభద్రుడి తలపై శివలింగం ఉండటం ఇక్కడి విశేషం. కొని దశాబ్దాల క్రితం లోకిరేవు వాగు ఒడ్డుపై వెలసిన స్వామివారు భక్తులతో నిత్య పూజలు అందుకుంటున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు తమ ఇలవేల్పుగా భావిస్తారు. ప్రతి ఏడాది మే నెలలో స్వామివారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం, శకటోత్సవం, అగ్నిగుండ మహోత్సవాలు పెద్దఎత్తున నిర్వహిస్తారు. కాగా, అగ్నిగుండ మహోత్సవంలో చాలా మంది శివ భక్తులు అగ్నిలో నడిచి మొక్కులు తీర్చుకుంటారు.



ఉత్సవాలకు ముస్తాబైన లోకిరేవు వీరభద్రస్వామి దేవాలయం

కార్యక్రమాలు ఇలా..

లోకిరేవు వీరభద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6న నందికోళ్ల సేవ, 7వ తేదీ తెల్లవారు జామున అగ్నిగుండ మహోత్సవం, సాయంత్రం శకటోత్సవం, పార్వతీ పరమేశ్వరుడి కల్యాణ్యం నిర్వహించనున్నట్లు పూజారులు లింగయ్య, నందీశ్వర్ తెలిపారు. 8న ప్రత్యేక అలంకరణ, 9న మహా మంగళహారతితో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. కాగా, ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

100 తులాల వెండి బహూకరణ



ధరూరు: మండల పరిధిలోని పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి ఆలయానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖర్‌రెడ్డి దంపతులు 100 తులాల వెండి వస్తువులు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు కిష్టాచార్యులకు ఆదివారం అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతలకు శేష వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చాలీసా పారాయణం



శాంతినగర్: మండల కేంద్రంలోని పల్లె ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం గోవిందనామ జపం, భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో రామచంద్రుడు, గాయత్రి శ్రీనివాసులు, కురువ వెంకటేశ్వర్లు, మదనమోహన్, మురళీ మోహన్, ఉపాధ్యాయులు మద్దిలేటి, మహానంది, జనహిత మాతాజీ పద్మ, భక్తులు పాల్గొన్నారు.

రవాణా సౌకర్యానికి రూ. 1,32 లక్షలు విరాళం



అయిజ: మండలంలోని సంకాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించడం కోసం బీఆర్ఎస్ నాయకుడు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రాముడు ఆయన నివాసంలో రూ. 1,32 లక్షలు విరాళాన్ని గ్రామస్తులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా రాముడు, సుజాత దంపతులను గ్రామస్తులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

అయిజ: హిందు ధర్మ పరిరక్షణ సమితి కార్యక్రమాల్లో భాగంగా విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజలోని అంబా భవాని ఆలయంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు బాల సంస్కార కేంద్రం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏఐసీసీ కార్యదర్శికి ఘన సన్మానం



సంపత్‌కుమార్‌ను శాలువాతో సన్మానిస్తున్న న్యాయవాదులు

శాంతినగర్: అలంపూర్‌లో స్పెషల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు మంజూరునకు కృషిచేసిన మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను అలంపూర్ న్యాయవాదులు ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. నూతన జిల్లాలు ఏర్పాటైన అనంతరం తెలంగాణలోని అన్ని తాలూక కోర్టుల్లో అదనపు కోర్టులు మంజూరయ్యాయన్నారు. అలంపూర్‌లో మాత్రం అదనపు కోర్టు మంజూరు కాలేదని, రోజురోజుకు కేసుల సంఖ్య పెరగడం, ఒకే కోర్టులో న్యాయసేవలు అందించడంలో ఇబ్బందులు తలెత్తుతున్న విషయమై సంపత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన ఆయన స్పెషల్ జ్యూడీషియల్ కోర్టు మంజూరుకు కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శేషదాసుల ఆరాధనోత్సవాలు



ధన్వంతరి హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శేషదాసుల 140వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, ధన్వంతరి హోమం నిర్వహించారు. అనంతరం వేదపండితులు రమేషాచారి, ప్రసన్నచారి భక్తులకు ప్రవచనాలు వినిపించారు. భజన మండలి సభ్యులు ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. మల్దకల్ గ్రామానికి చెందిన దాత దామ శంకరయ్య, దామ పార్వతమ్మ రూ.5 లక్షల వ్యయంతో తయారు చేసిన రథాన్ని వితరణ చేశారు. దాతలను ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ధీరేంద్రదాస్ సన్మానించారు. కార్యక్రమంలో శశాంక, విష్ణు, అరవిందరావు, ముకుందరావు, మదన్‌మోహన్, వెంకటేశ్వరావు, భీమ్‌సేనాచారి, శ్రీకాంత్ జోషి, రవిచారి, మధుసూదనాచారి, దామ మురళి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



అయిజలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



జిల్లా కేంద్రంలో రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

గద్వాలటౌన్: ఎంపీ డీకే అరుణ జన్మదిన వేడుకలు ఆదివారం ఉదయం డీకే బంగ్లాలో పార్టీ కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు మొత్తం 52 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్నిగ్ధారెడ్డి మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని రక్తదానంతో కాపాడొచ్చన్నారు. రక్తదానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బండల పాండు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, బండల వెంకట్రాములు, రామచంద్రారెడ్డి, రవికుమార్, జయశ్రీ, నర్సింహ, అనిల్, చిత్తారికిరణ్, కృష్ణ, దేవదాసు, ధరూర్ కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ జన్మదినం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, ప్రదీప్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్, లక్ష్మణాచారి, రాజశేఖర్, రఘు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి



గట్టులో జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

ఎర్రవల్లి: పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి అని జిల్లా సాగర సంఘం గౌరవ అధ్యక్షుడు జోగుల రవి అన్నారు. మండల కేంద్రంతో పాటుగా రాజశ్రీ గార్లపాడులో ఆదివారం సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సాగర సంఘం నాయకులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. భగీరథుడు తన తపస్సుతో దివి నుంచి భువికి గంగను తీసుకొచ్చి పట్టుదలకు మారు పేరుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు కరడ రవి, వెంకటన్న, రాఘున్న, రాముడు, ఆంజనేయులు, బీచుపల్లి, బాబన్న, శివ, రాజేష్, పెద్దభీముడు, రవిచంద్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రాజశ్రీ గార్లపాడులో నివాళులర్పిస్తున్న సగర సంఘ నాయకులు

ధరూరు: మండల పరిధిలోని మాల్‌దొడ్డిలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంజి సాగర్, శ్రీరాములు, నర్సింహులు, గోపాల్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని ఏ. బుర్దిపాడు గ్రామంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో గోపాల్, మధు, గోవింధు, మల్లన్న, ఆంజనేయులు, శివశంకర్, తిమ్మన్న, రాముడు, మురళి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

గట్టు: భగీరథ మహర్షి జయంతి వేడుకలు మండల కేంద్రంలో సగర సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ సత్యనారాయణ, రిటైర్డ్ హెచ్ఎం గోవిందప్ప, కాంట్రాక్టర్ కృష్ణమూర్తి, సగర సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి రవీంద్రబాబు, సగర సంఘం నాయకులు శ్రీనాథ్, యశ్వంత్, రాజుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు-రంగారెడ్డి'ని పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నదీ జలాల వినియోగంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తీవ్ర అన్యాయానికి గురైందని.. అభివృద్ధిని పాలకులు మాటలకే పరిమితం చేయకుండా చేతల్లో చూపించాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తప్పక అమలు చేయాలన్నారు. పార్టీతో పాటు ప్రజా సంఘాలను గ్రామస్థాయి నుంచి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు పాటుపడాలన్నారు. అంతకుముందు పహల్గాం ఘటనలో మృతిచెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బ్రుగి బాల్‌కిషన్, గోవర్ధన్, అల్వాల్‌రెడ్డి, డి.రాము, పి.సురేష్, బి.ఆర్.విల్సన్, సత్యనారాయణరెడ్డి, సి.రాజు, కె.పద్మావతి పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం

ఆత్మకూర్: కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆత్మకూర్ మండలంలోని మూలమల్ల, కత్తేపల్లి గ్రామాల్లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్, టీయూసీఐ ఆధ్వర్యంలో కార్మికులు ఘనంగా మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా నాయకులు ప్రసాద్, వెంకటన్న మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని, అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో షద్రక్, కృపాదానం, శేఖర్, రవి, కురుమూర్తి, బుచ్చన్న, నాగేష్, సుభాష్, కార్మికులు పాల్గొన్నారు.